క్లుప్తంగా

నాడు నేడు పనులపై పర్యవేక్షణ పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న గోనేనాయక్

సి.బెళగల్: మనబడి నాడు నేడు రెండవ విడతలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలపై సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లు పర్యవేక్షణ పెంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ సూచించారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్ ఏఈ గంగరాజుతో కలిసి ఇంజినీర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంలు, పీఎంసీ సభ్యులతో ఇంజినీర్ అసిస్టెంట్లు రెగ్యులర్‌గా సమీక్షించుకోవాలని, నాణ్యతగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గడప గడపకు–మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి గురువారం తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయ కోరారు.

బిలకల గూడూరులో..

గడివేముల: మండల పరిధిలోని బిలకల గూడూరు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

పంట నమోదు పక్కాగా ఉండాలి



వెంకటగిరిలో పంట నమోదును పునర్ పరిశీలించిన ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : ఖరీఫ్ కింద సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. గురువారం మండలంలోని వర్కూరు, వెంకటగిరి, ప్యాలకుర్తి గ్రామాల్లో ఏఓ రవిప్రకాష్ పర్యటించి ఆర్‌బీకే సిబ్బంది, వీఆర్వోలు నమోదు చేసిన పంట నమోదును పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ పంట నమోదులో నిర్లక్ష్యం వహించకుండా పంటలు సాగు చేసిన రైతుల పేర్లను, పంటను మాత్రమే నమోదు చేయాలన్నారు. పంట నమోదుతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కల్లూరు: మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, పత్తి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు కార్యాలయ అధికారి సంతోష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో యాజమాన్య పద్ధతులపై ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నంద్యాల వారు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రసం పీల్చే పురుగులకు జిగురు అట్టలు, గులాబీ రంగు పురుగులను అరికట్టడానికి లింగార్షక బుట్టలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, కర్నూలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సాలురెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు మోహన్ విష్ణు, లక్ష్మికల్యాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ముదుమాలలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఓఈఆర్డీ సందీప్ అన్నారు. గురువారం సి.బెళగల్ మండల పరిధిలోని ముదుమాల గ్రామంలో డెంగీ అనుమానిత కేసులపై ఆయన వైద్య అధికారులు, సిబ్బందితో కలిసి ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య సిబ్బంది జబ్బు అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామస్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి అధికంగా ఉందని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వృద్ధుడికి వైద్య సేవల రిపోర్ట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం–1 పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి కోట్ల మందికి ప్రాణం పోశారన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో 108 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు.

అందులో భాగంగానే పల్లెలతో వైద్యులను పంపి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధి గ్రస్తులను గుర్తించి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందించడం అద్భుత కార్యక్రమమన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్లు పలువురికి వైద్య సేవలు అందించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, మండల కన్వీనర్ కరునాకర్‌రెడ్డి, బాబు, డాక్టర్లు సునీతా, సునీల్, సుబ్బారెడ్డి, ఎల్లకిట్టు, మహేంద్రారెడ్డి, టైలర్ బాషా పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి



రిపోర్ట్స్ పరిశీలిస్తున్న డీఐఓ ప్రవీణ్‌కుమార్

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఓర్వకల్లు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం నన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డీఐఓ సందర్శించారు. క్యాంపులో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, కేస్ షీట్, ల్యాబ్ పరీక్షలు, వైద్య సేవలు, మందుల కౌంటర్లు, స్పాట్ సర్వే కౌంటర్, తాగునీరు తదితర కౌంటర్లను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఉచిత మందులు, వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్, ఆసుపత్రి వైద్యులు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సూచించా. గురువారం పుసులూరు గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిశోర్, సీహెచ్‌సీ సురేష్, డాక్టర్లు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, గ్రామ నాయకులు రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యం



కొత్రపోలూరు మెడికల్ క్యాంపులో ఈసీజీ తీస్తున్న దృశ్యం

గడివేముల: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, డాక్టర్ మొల్లా జబీన్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్రపోలూరు ఎంపీయూపీ పాఠశాల ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ మాలిక్‌బాషాష ప్రారంభించారు. వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేషస్పందన లభించింది. దాదాపు 480 మందికి బీపీ, షుగరు, మలేరియా, టైఫాయిడ్, డెంగీతో పాటు నొప్పులు, కంటి సమస్యలు, చిన్నపిల్లలకు ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషహార శిబిరం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలశ్రీ ష్ట,వైద్య సిబ్బంది మనోహర్, రాజ్‌కుమార్,సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖర్చులేకుండా వైద్య సేవలు



మా ఊరికే పెద్ద డాక్టర్లు వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. చాలా సతోషంగా ఉంది. వారం రోజుల నుంచి మా ఇంటి వద్దకు వైద్య సిబ్బంది వచ్చి పరీక్షలు నిర్వహించి టోకెన్ ఇచ్చారు. గత ప్రభుత్వంలో వైద్యం గురించి పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నారు.

– గుష్పల వెంకటరమణ, కొత్రపోలూరు

జగనన్న సురక్షతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్

• హెల్త్ క్యాంపును పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



వృద్ధురాలికి కంటి అద్దాలు సరిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గురువారం కోడుమూరులోని కొండపేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే డా.సుధాకర్ సందర్శించారు. క్యాంపులో అందుతున్న వైద్య సేవలపై ప్రజలతో మాట్లాడి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్యసేవలు పొందాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వృద్ధులకు ఎమ్మెల్యే కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్లు జయంతి, నస్రీన్, మదన్, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, సర్పంచు మధుసూదన్‌రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, స్థానిక నాయకులు అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బలరాం, ఐసీడీఎస్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన :

కోడుమూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపుకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. క్యాంపుకు సుమారు 300మందికిపైగా ప్రజలు తరలివచ్చి తమ తమ ఆరోగ్య స్థితిగతులపై పరీక్షలు చేయించకోగా, వైద్య సిబ్బంది వారికి ఉచితంగా మందులను అందజేశారు.

హెల్త్ క్యాంప్‌లో 310 మందికి వైద్య సేవలు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామ సచివాలయం – 2 పరిధిలో మండల అధికారులు, వైద్యులు గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌నకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. డాక్టర్లు శ్రావణి, సునిత, రంజిత్ నాయక్, ప్రసన్నకుమారి, సంపత్, వైద్య సిబ్బంది రోగులకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు బీపీ, షుగర్, ఈసీజీ, కంటి, రక్త తదితర పరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో జగనన్న సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్‌పై డాక్టర్లు, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు మహిళలకు అవగాహన కల్పించారు. హెల్త్ క్యాప్‌లో 310 మందికి వైద్య సేవలు అందించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ హరిచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు, వలంటీర్లు పాల్గొన్నారు.



సి.బెళగల్ మండలం పోలకల్‌లో హెల్త్ క్యాంప్‌లో ప్రజలను పరీక్షించి ఓపీ ఇస్తున్న వైద్య సిబ్బంది



మహిళలకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజారోగ్యమే జగనన్న లక్ష్యం

గూడూరు: ప్రజారోగ్యమే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో గురువారం వైఎస్సార్ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే... ముఖ్యమంత్రిగా ఉండాలి

• ఎమ్మెల్యేతో ఓ వృద్ధుడు



హెల్త్ క్యాంపులో ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న వృద్ధుడు కనికె నాగరాజు

కొండపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును సందర్శించిన కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మహిళలతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే డాక్టర్లు ఎలా పరీక్షలు చేస్తున్నారు... మందులు ఉచితంగానే ఇచ్చారా అనిఅడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడే కుర్చీలో కూర్చుని ఉన్న కొండపేటకు చెందిన వృద్ధుడు కనికె నాగరాజు జోక్యం చేసుకుని వైద్య సేవలు చాలా బాగున్నాయని ఎమ్మెల్యేతో చెప్పారు. గతంలో ఏ గవర్నమెంటోళ్లు మా ఆరోగ్యాన్ని పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ బాబు మాత్రమే ఇంటి వద్దకే డాక్టర్లను పంపి వైద్య సేవలు అందజేస్తున్నారన్నారు. ఇప్పుడు మళ్లీ శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా అన్ని పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తూ మాలాంటోళ్లను పట్టించుకుంటున్నారన్నారు. కన్నపిల్లలే పట్టించుకోని పరిస్థితుల్లో పేదలు, వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్న జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నినదించారు. నెలా... లేదా రెండెన్నళ్ల కోసారైనా ఇలాంటి వైద్య శిబిరాలు చేపట్టాలని వృద్ధుడు ఎమ్మెల్యేను కోరారు. వృద్ధుడి మెడికల్ రిపోర్టు పరిశీలించిన ఎమ్మెల్యే ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి



కోడుమూరులో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ వెంకటలక్షమ్మ

కోడుమూరు రూరల్ : పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బందిదేనని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. గురువారం కోడుమూరులోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను పీడీ వెంకటలక్ష్మమ్మ తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. పీడీ మాట్లాడుతూ రక్తహీనత సమస్య తలెత్తకుండా గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని, రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పౌష్టికాహార కిట్లును ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవిలత, జరీనా, రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును శుక్రవారం కోడుమూరు గ్రామ సచివాలయం–5 పరిధిలోని కొండపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరని, ప్రజలు హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు బురాన్‌దొడ్డిలో హెల్త్ క్యాంప్

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాప్ నిర్వహిస్తున్నట్లు సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి పనుల్లో తప్పులకు తావివ్వకండి



సామాజిక తనిఖీల ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: ఉపాధి హామీ పనులలో ఎలాంటి తప్పులకు తావివ్వకూడదని, పనులతో మండలం అభివృద్ధి చెందేలా ఉండాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. మండలంలో 16వ సామాజిక తనిఖీలో భాగంగా అధికారులు గతవారం రోజులుగా చేపట్టిన సామాజిక తనిఖీలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల ఉపాధిహామి అధికారులు ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి పనులు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.

ఉపాధి పనులలో తప్పులు చేస్తే శిక్ష

సామాజిక తనిఖీలపై నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరైన జిల్లా డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలులో తప్పులు చేసేవారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. రైతులు, కూలీలు ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పండ్లు, పూల తోటల పెంపకానికి ముందుకు రావాలని పీడీ సూచించారు.

తనిఖీలలో రూ.43,796 అవకతవకలు

మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో చేపట్టిన ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ పనులపై ఎస్‌ఆర్పీ మల్లికార్జున ఆధ్వర్యంలో 10 మంది డీఆర్పీలు గ్రామాలలో 16వ విడత సామాజిక తనిఖీలను నిర్వహించారు. కాగా ఈ ఏడాది సామాజిక భద్రత (పింఛన్ల)పై కూడా తనిఖీలో చేర్చడంతో, మండల వ్యాప్తంగా ఉన్న 7,318 పింఛన్ల పంపిణీపై తనిఖీ చేపట్టడం జరిగిందని ఎస్ఆర్పీ తెలిపారు. మొత్తం మండలంలో 732 పనులపై చేసిన ఖర్చు రూ.11,08,78,655లపై సమాజిక తనిఖీ నిర్వహించగా, అధికారుల నిర్లక్ష్యంపై రూ.14,500లను అధికారులు సిబ్బందికి జరిమానా కలిపి రూ.43,796లు అవకతవకలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీపీఓ చంద్రశేఖర్, ఏపీడీ ఖలీల, ఏఓ షరీఫ్, ఐడిలీ ఎంపీడీఓ రాముడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్విరాజ్, డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి



ప్యాలకుర్తి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ సిద్దలింగమూర్తి

కోడుమూరు: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరైన లబ్ధిదారులంతా త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సూచించారు. గురువారం మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీని పీడీ సిద్ధలింగమూర్తి సందర్శించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం లబ్ధిదారులకు అవసరమైన రోడ్లు, మంచినీరు, కరెంట్ వంటి వసతి సౌకర్యాలను కల్పించిందన్నారు. హౌసింగ్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు కూడా లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలని పీడీ ఆదేశించారు. పీడీ వెంట డీఈఈ వాసుదేవరావు ఉన్నారు.

చేసిందే చెప్పండి

• ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: నాలుగేళ్లలో మన ప్రభుత్వం చేసిన మంచి పనులనే ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాణ్యం మండలానికి సంబంధించి ఈ నాలుగేళ్ల వ్యవధిలో అనేక అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు చేసిన మరమ్మతులను గుర్తు చేయాలన్నారు. నాలుగేళ్లలో దాదాపు రూ.వంద కోట్లతో పాణ్యంలో సీసీ రోడ్లు, బీటీ, బ్రిడ్జిలు, డ్రైనేజీలు తదితర పనులు చేపట్టామని ఇవన్నీ ప్రజలకు విడమరిచి చెప్పాలన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి పథకం ప్రజలకు చేరుతున్న విధానాన్ని, టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సాగించిన అరాచకాలను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను వివరించి మరోసారి జగనన్నే కావాలనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేనీబీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, మండల కన్వీనర్ కరునాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాలనకు కేరాఫ్ ఏపీ



మహిళకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: దేశంలోనే ఆదర్శ పాలనకు కేరాఫ్ ఏపీ నిలుస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కొలూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాయం–1 నూతన భవాన్ని ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అవినీతి రహిత పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం ఇటీవల మట్టి మిద్దె కూలి ఇద్దరు వృద్ధులు చనిపోయిన ఇంటిని పరిశీలించారు. ప్రమానికి కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేనీబీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఏపీ యూఎఫ్ఐడీసీ డైరెక్టర్ మన్నె కరుణాకర్, బాలస్వామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహానందిరెడ్డి, వెంకటరెడ్డి, పాణి, మండల సచివాలయల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, మండల కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ దస్తగిరి, మండల ఇంజనీరు మహబూబ్‌బాషా, బాబు, రాజన్న, కో– ఆప్షన్‌సభ్యులు జాకీర్‌ఉసేన్ పాల్గొన్నారు.

శ్రీవాల్మీకి రామాలయంలో ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని శ్రీవాల్మీకి రామాలయంలో గురువారం గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శ్రీవాల్మీకి రామాలయంలో ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించి 40 రోజులు పూర్తి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టినట్లు పూజారి సుదర్శణమాచర్యులు తెలిపారు. అదే విధంగా శ్రీసీతా, లక్ష్మణ, అంజనేయ, శ్రీ రాముడు ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ప్రారంభం

పాణ్యం: మండల కేంద్రంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూ పరిధిలోని 8 కళాశాల విద్యార్థులకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్జీఎం కళాశాల డీన్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

పాణ్యం: ఈనెల 7 నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చలో అలంపూర్ పాదయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దల సామేల్ కోరారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద పాదయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మపోగు బాబు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.